మాజీ మంత్రి హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

మాజీ మంత్రి హరీశ్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నారాయణఖేడ్, మార్చి 21: మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావుపై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా పెట్టిన ఫోన్ ట్యాపింగ్ కేసును హైకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో శుక్రవారం నారాయణఖేడ్‌లో బీఆర్‌ఎస్ నాయకులు హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసి సంబురాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ కమిటీ మాజీ సభ్యుడు రవీందర్ నాయక్ ఆధ్వర్యంలో 4వ వార్డులోని భవానీమాత, సేవాలాల్ ఆలయంలో భోగ్‌భండార్ నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు నగేశ్, నాయకులు వెంకటేశం, ప్రభాకర్, రవినాయక్, అంజాగౌడ్, నర్సింహులు, సిద్ధు, మల్‌గొండ, కృష్ణారెడ్డి, శంకర్‌నాయక్, మశ్చేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో భోగ్‌భండార్ నిర్వహిస్తున్న నాయకులు

కేసుకొట్టివేతతో బీఆర్‌ఎస్ నేతల హర్షం

మాజీ మంత్రి హరీశ్‌రావును కలిసిన ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ నేతలు

జహీరాబాద్, మార్చి 21 : మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావుపై నమోదైన ఫోన్‌ట్యాపింగ్ కేసును హైకోర్టు రద్దు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం జరిగిందని జహీరాబాద్ నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీల అధ్యక్షులు పేర్కొన్నారు. హరీశ్‌రావుపై నమోదైన ఫోన్ ట్యాపింగ్ కేసును సరైన ఆధారాలు లేవని హైకోర్టు రద్దు చేసినందుకు శుక్రవారం హైదరాబాద్‌లోని అసెంబ్లీ ఆవరణలో ఆయనను జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావుతో కలిసి హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, జహీరాబాద్, కోహీర్, ఝరాసంగం, మొగుడంపల్లి మండలాలకు చెందిన బీఆర్‌ఎస్ అధ్యక్షులు తట్టు నారాయణ, నర్సింహులు, వెంకటేశం, సంజీవ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకువు మీధున్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

మున్సిపల్ కమిషనర్ పేరుతో సైబర్ నేరగాళ్ల ఫోన్లు

సదాశివపేట, మార్చి 21 : సైబర్ నేరగాళ్లు మరో కొత్త తరహా మోసానికి తెరలేపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సదాశివపేట మున్సిపల్ అధికారులు, సిబ్బంది పన్ను వసూలుతో పాటు ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యువల్ చేస్తున్నారు. ఇదే అదునుగా భావించిన సైబర్ నేరగాళ్లు శుక్రవారం సదాశివపేట పట్టణంలోని కొందరు దుకాణాదాలకు ఫోన్ కాల్స్ చేశారు. నేను మున్సిపల్ కమిషనర్‌ను మాట్లాడుతున్నా. మీ ట్రేడ్ లైసెన్స్ గడువు ముగిసింది, లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలి, డబ్బులు కట్టకపోతే ఫైన్ వేస్తాము. నేను పంపించిన ఫోన్ నెంబర్‌కు ఫోన్‌పే, గూగుల్ పేలో డబ్బులు పంపించాలని ఫేక్ నెంబర్ (91 7989272438) నుంచి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. దుకాణాలకు సంబంధించిన ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలి, మిషన్ భగీరథ బిల్లులు చెల్లించాలని పట్టణంలోని పలువురికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. ఇదిలా ఉండగా సదాశివపేట మున్సిపల్ కమిషనర్‌గా మహిళా అధికారి ఉండడంతో పలువురికి అనుమానం వచ్చింది. దీంతో మున్సిపల్ కమిషనర్ ఉమాకు తెలియజేయడంతో వెంటనే కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సదాశివపేట పట్టణ ప్రజలు సైబర్ నేరగాళ్ల ఫోన్ కాల్స్‌కు రెస్పాన్స్ అవొద్దని పోలీసులు తెలిపారు. ఫోన్ పే, గూగుల్‌పే లకు ఎలాంటి డబ్బులు పంపవద్దని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

సమావేశంలో మాట్లాడుతున్న జహీరాబాద్ డీఎస్పీ

జహీరాబాద్, మార్చి 21 : అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో డివిజన్ పరిధిలోని ఫ్యాక్టరీలు, వ్యాపార సముదాయాల తదితర యాజమాన్యలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి అగ్నిమాపక అధికారులు, పోలీసులు అవగాహన కల్పించారు. సమావేశంలో జహీరాబాద్ పట్టణ సీఐ శివలింగం, ఎస్సైలు కాశీనాథ్, ప్రభాకర్‌రావు, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ ను సద్వినియోగం చేసుకోవాలి

అందోల్, మార్చి 21: డ్వాక్రా సంఘాల మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు మహిళా సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని టీవోటీ మాధవి సూచించారు. శుక్రవారం అందోల్ మండల మహిళా సమైఖ్య కార్యాలయంలో అందోల్, పుల్కల్, వట్‌పల్లి మండలాల మహిళా సంఘాలకు శిక్షణ తరగుతులు ప్రారంభించారు. ఏపీఎంలు మాణిక్యం, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దవాఖానల్లో కాయకల్ప బృందం తనిఖీ

సమావేశంలో మాట్లాడుతున్న కాయకల్ప బృందం సభ్యులు

అందోల్, మార్చి 21 : జోగిపేట ప్రభుత్వ దవాఖానను శుక్రవారం కాయకల్ప బృందం తనిఖీచేసి వసతులను పరిశీలించారు. సూపరిండెంటెండ్ డాక్టర్ సౌజన్యతో కలిసి దవఖానలోని పలు విభాగాలు పరిశీలించారు. అందుతున్న వైద్య సేవలు, కల్పించాల్సిన వసతులు భోజనం ఇతరత్రా వివరాలు తెలుసుకున్నారు. అనంతరం దవఖానలో పనిచేసే డాక్టర్లు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. బృందం సభ్యులు డాక్టర్ సురేశ్, రాజ్‌కిరణ్, రాధ, కృపాలిని తదితరులు ఉన్నారు.

పరామర్శ

కార్యకర్తను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

అందోల్, మార్చి 21: రోడ్డు ప్రమాదంలో గాయపడిన పార్టీ కార్యకర్త కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ శుక్రవారం పరామర్శించారు. మండల పరిధిలోని నేరడిగుంట గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త పరిపూర్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి సంగారెడ్డిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దవఖానకు వెళ్లి పరామర్శించి కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. అధైర్య పడొద్దని తాను అండగా ఉంటానని హామీనిచ్చారు.

ఉపాధి పని చేస్తూ మహిళ మృతి

నారాయణఖేడ్, మార్చి 21: ఉపాధి హామీ పనులు చేస్తూ ఓ మహిళా మృతిచెందిన ఘటన శుక్రవారం నారాయణఖేడ్ మండలం ర్యాకల్‌లో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బోయిని లచ్చవ్వ (55) రోజు మాదిరిగానే ఉపాధిహామీ పనులకు వెళ్లి కాల్వ తీసే పనులు చేస్తుండగా ఒక్కసారిగా స్పృహతప్పి పడిపోయింది. దీంతో తోటి కూలీలు గమనించి ఆమెను నారాయణఖేడ్ ఏరియా దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకుడు రవీందర్‌నాయక్ దవాఖానకు వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. లచ్చవ్వ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డిలోని మిషన్ భగీరథ పంప్‌హౌస్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

కంది, మార్చి 21 : సంగారెడ్డి పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా, నిరంతరంగా శుద్ధమైన తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి మిషన్ భగీరథ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మిషన్ భగీరథ ఇంజినీర్లు, మున్సిపల్ అధికారులతో కలిసి మిషన్ భగీరథ పంప్‌హౌస్ వద్ద సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి సమస్య రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంగారెడ్డి పట్టణం డ్రైవర్స్ కాలనీలోని మిషన్ భగీరథ పంప్‌హౌస్ పనితీరును పరిశీలించారు. మిషన్ భగీరథ ఎస్ ఈ రఘువీర్, ఈఈ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ చవాన్, డిప్యూటీ ఇంజినీర్ ఇంతియాజ్, పబ్లిక్ హెల్త్ అధికారి కృష్ణ మోహన్, ఏఈ రఘువీర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతన బోధన పద్ధతులు అవలంబించాలి

కంది, మార్చి 21 : మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతన బోధనా పద్ధతులను అవలంబించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఐసీడీఎస్, అజీమ్ ప్రేమ్ జీ ఫౌండేషన్ల సం యుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 9వ పూర్వ బాల్య సంరక్షణ, విద్యా వారిక సదస్సుకు కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సదస్సులో చర్చించిన అంశాలు, నూతన పాఠ్య ప్రణాళికలు అమలు చేసేలా అంగన్‌వాడీ టీచర్లు ముందకు సాగాలన్నారు. చైల్డ్ వెల్ఫేర్ అధికారి మోతి, జిల్లా సంక్షేమాధికారి లలితకుమారి పాల్గొన్నారు.

సజావుగా 'పది' పరీక్షలు

- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ వల్లూరు క్రాంతి , ఎస్పీ పారితోష్ పంకజ్

కంది, మార్చి 21 : పదో తరగతి పరీక్షలు మొదటి రోజు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో ఏర్పాటు చేసిన 122 పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు, ఒత్తిడిలకు గురికాకుండా పరీక్ష రాసేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్నారు. మొత్తం 22410 మంది విద్యార్థులకు 22370 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 40 మంది గైర్హాజరయ్యారు. మొదటి రోజు 99.82 హాజరు శాతం నమోదైంది.

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

ఎలాంటి అక్రమాలు, అవకతవకలకు తావు లేకుండా పదో తరగతి పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సంగారెడ్డి పట్టణంలోని రిషి పబ్లిక్ స్కూల్, సెయింట్ ఆర్నాల్డ్స్ హైస్కూల్ పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట డీఈవో వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు ఉన్నారు.

కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

కంది/సంగారెడ్డి, మార్చి 21 : పదో తరగతి పరీక్షల నిర్వహణకు పటిష్ట బందోబస్తును నిర్వహిస్తున్నామని ఎస్పీ పారితోష్ పంకజ్ పేర్కొన్నారు. శుక్రవారం సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల, కరుణా హైస్కూల్, సాహితీ హైస్కూల్ పరీక్ష కేంద్రాలను ఎస్పీ తనిఖీ చేసి బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద ఏమైన అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే 100 లేదా సమీప పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

పరీక్ష కేంద్రాలు, బందోబస్తు పనితీరును పరిశీలిస్తున్న ఎస్పీ పారితోష్ పంకజ్

అమీన్‌పూర్‌లో కొనసాగుతున్న పదో తరగతి పరీక్షలను సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. ఆయన వెంట ఆర్‌ఐలు రఘునాథ్‌రెడ్డి, శ్రీమాన్ ఉన్నారు.

అమీనపూర్,మార్చి 21

మెడికల్ కళాశాల తనిఖీ

మెడికల్ కళాశాల రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో గాయత్రి దేవి

పటాన్ చెరు, మార్చి 21: పటాన్ చెరు మండలం చిట్కుల్‌లోని మహేశ్వర మెడికల్ కళాశాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గాయత్రి దేవి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా స్కాన్ సెంటర్ నిర్వహణపై ఆరా తీశారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. కళాశాల తీసుకున్న వివిధ శాఖల అనుమతుల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. కళాశాల యాజమాన్యం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇష్టం లేని పెండ్లి చేశారని ..

యువతిని తల్లి దండ్రులకు అప్పగించిన పోలీసులు

నారాయణ గూడ పోలీస్ స్టేషన్ లో ఎస్సై పాటిల్ క్రాంతి కుమార్, సిబ్బంది తో స్వప్న

పుల్కల్, మార్చి 21 : ఇష్టం లేని పెండ్లి చేశారని యువతి రెండేండ్ల కింద ఇంట్లో నుంచి ఎవరికి చెప్ప కుండా పారి పోయింది. అప్పట్లో మిస్సింగ్ కేసు కింద పుల్కల్ పోలీస్టేషన్‌లో కేసు నమోదు చేసుకున్న పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేపట్టారు. గురువారం హైదరాబాద్ నారాయణ గూడ పరిధిలోని ఓ హాస్టల్ ఉంటుందని తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని యువతికి నచ్చ జెప్పి తిరిగి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలం లోని శౌర్యానాయక్ తండా, లక్ష్మీసాగర్ గ్రామానికి చెందిన శోభన్ పెద్ద కూతురు స్వప్నకు సుద్దవడక తండా, వికారాబాద్ జిల్లా నివాసి పాండుకు ఇచ్చి మార్చి, 2023లో వివాహం జరిపించారు. ఇష్టం లేని వివాహం జరిపించారని అదే సంవత్సరం మే నెలలో స్వప్న పుట్టింటికి వచ్చి, ఇంటి నుంచి వెళ్లి పోయింది. అప్పటి నుంచి ఎవరికీ సమాచారం తెలియకుండా హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు ఉద్యోగం చేస్తు అక్కడే ఓహాస్టల్ ఉండి పోయింది. ముమ్మరంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులకు సమాచారం అందడంతో ఎస్సై పాటిల్ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో అక్కడికి చేరుకొని స్వప్నను నారాయణగూడ పోలీస్ స్టేషన్‌కు తరలించి తల్లిదండ్రులకు అప్పగించారు.

ఎస్సీ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలి

జిన్నారం, మార్చి 21: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో పారిశుధ్య లోపంతో కాలనీవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో సమస్య మరింత జటిలంగా మారుతుందని వాపోతున్నారు. అధికారులు కాలనీపై దృష్టి కేంద్రీకరించి వెంటనే పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని కోరారు.

రసాయన వ్యర్థ జలాల శాంపిల్స్ సేకరణ

రసాయన వ్యర్థ జలాలను సేకరిస్తున్న పీసీబీ అధికారులు

జిన్నారం, మార్చి 21 : బొల్లారం పారిశ్రామిక వాడలో పీసీబీ అధికారులు పలు పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహించారు. గతంలో వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన అధికారి కుమార్ పాఠక్ ఆదేశాల మేరకు పీసీబీ సైంటిస్ట్ రవీందర్ సిబ్బంది పారిశ్రామికవాడలోని పలు ప్రదేశాల్లో పర్యటించి పరిశ్రమల నుంచి విడుదలవుతున్న రసాయన కాలుష్య వ్యర్థ జలాలను సేకరించారు. శాంపిల్స్‌ను ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించి బాధ్యులైన పరిశ్రమలపై తగిన విధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, స్థానికులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

రాయికోడ్,మార్చి 21: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతిచెందింది. పలువురికి గాయాలైన సంఘటన రాయికోడ్‌లో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. రేగోడ్ మండలం చౌదరిపల్లి గ్రామానికి చెందిన మణెమ్మ, పలువురు మహిళలు హస్నాబాద్ వచ్చి గురువారం రాత్రి తిరిగి చౌదరిపల్లికి వెళ్తున్నారు. ఈ క్రమంలో బోలెరా వాహనం అదుపు తప్పి బోల్తా పడడంతో మణెమ్మకు బలమైన గాయాలయ్యాయి. జహీరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందింది. పలువురికి గాయాలు కావడంతో సంగారెడ్డి, హైదరాబాద్‌కు తరలించారు. కేసు నమెదు చేసి శుక్రవారం దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

వనంపల్లిలో తాగునీటి కటకట

వనంపల్లిలోని ఓవర్ హెడ్ ట్యాంక్

ఝరాసంగం, మార్చి 21 : మండల పరిధిలోని వనంపల్లిలో తాగునీటి సమస్య తలెత్తడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వేసవి తీవ్ర రూపం దాల్చకముందే ఈ గ్రామంలో రక్షిత మంచినీటి పథకం బోర్లలో భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో ఉన్న రెండు బోర్లు గంటసేపు నీరు రాగానే గ్యాప్ వస్తున్నట్లు గ్రామస్తులు వివరించారు. దీంతో ఓవర్ హెడ్ ట్యాంక్‌లోకి సరిపడు నీళ్లు చేరకపోవడంతో నిండడం లేదని వారు తెలిపారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతిరోజు నీటిసరఫరా చేసినట్లయితే తమకు తాగునీటి సమస్య ఉండదని ప్రజలు వాపోయారు. ఇప్పటికైనా నీటి సమస్య మరింత ఉధృతం కాకముందే సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

డంపింగ్‌యార్డు రద్దు చేయాలని ప్రజాబ్యాలెట్

11 గ్రామాల్లో ఓటింగ్ నిర్వహించిన రైతు జేఏసీ

నల్లవల్లిలో డంపింగ్‌యార్డు రద్దు చేయాలని ఓట్లు వేస్తున్న మహిళలు

గుమ్మడిదల, మార్చి 21 : ప్యారానగర్ డంపింగ్‌యార్డు(ఎంఎస్‌డబ్ల్యూ) వద్దంటూ గుమ్మడిదల మండల వ్యాప్తంగా ప్రజాబ్యాలెట్‌తో ఓటింగ్‌ను సీపీఎం, రైతు జేఏసీ నాయకులు నిర్వహించారు. శుక్రవారం గుమ్మడిదల మున్సిపాలిటీతో పాటు నల్లవల్లి, కొత్తపల్లి, మంబాపూర్, వీరన్నగూడెం, అన్నారం, దోమడుగు తదితర గ్రామాల్లో రిలే నిరాహార దీక్షలతో పాటు రైతు జేఏసీ నాయకులు ప్రజాబ్యాలెట్ ద్వారా ప్రజాభిప్రాయసేకరణ చేశారు. ఈ ప్రజాబ్యాలెట్‌కు విశేష స్పందన లభించింది. అధిక సంఖ్యలో ఆయా గ్రామాల్లో ప్రజలు ప్రజాబ్యాలెట్‌ను వినియోగించుకున్నారు. ఓటేసిన వారిలో వందశాతం డంపింగ్‌యార్డు వద్దంటూ ఓటేసినట్లు ప్రజలు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం, ప్రజా పోరాట సమితి నాయకులు కే రాజయ్య, నాగేశ్వర్, జయరాజ్ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలోని గుమ్మడిదల మండలం, నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ సమీపంలో జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేస్తున్న డంపింగ్‌యార్డు (ఎంఎస్‌డబ్ల్యూ) ప్రజల జీవన వ్యవస్థపై తీవ్ర ప్రభావం ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజాబ్యాలెట్ ద్వారా తమ వ్యతిరేకతను తెలియజేయడానికే ప్రజాబ్యాలెట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ తీర్పును రాష్ట్ర ప్రభుత్వానికి, అనుమతులు ఇచ్చిన శాఖలకు నివేదిస్తామన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేసి ఇచ్చిన అనుమతులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జేఏసీ కమిటీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్, సంజీవరెడ్డి, గోపాల్, దేవేందర్‌రెడ్డి, సదానందరెడ్డి, మంద భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరుగ్యారెంటీలు అమలు చేయాలి

బుధేరాలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

మునిపల్లి, మార్చి 21 : ఎన్నికల ముందు నోటికి వచ్చినట్లు 420 పథకాలను అందిస్తామని హామీలు ఇచ్చి,ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ముందు రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ పార్టీ మునిపల్లి మండల ప్రధాన కార్యదర్శి శశికుమార్, మల్లికార్జునపల్లి మాజీ ఎంపీటీసీ శివకుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని బుదేరా చౌరస్తాలో స్థానిక విలేకర్లతో సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ నాయకుల మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ముందుగా రేవంత్‌రెడ్డి సర్కార్ ప్రజలను ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసి ప్రజలకు ఇచ్చిన మాటను నిలుపుకొన్నాకే కొత్త పథకాలు ప్రారంభించాలన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్, సుల్తాన్, హఫీజ్, దత్తు, సురేశ్ తదితరులు ఉన్నారు.

ఆశవర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఆత్మకూర్ పీహెచ్‌సీ డ్యూటీ డాక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆశవర్కర్లు

సదాశివపేట, మార్చి 21 : పెరిగిన ధరలకు అనుగుణంగా ఆశవర్కర్లకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, అనేక సంవత్సరాలుగా పని చేస్తున్న ఆశాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో సదాశివపేట, ఆత్మకూర్ పీహెచ్‌సీల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆశవర్కర్లకు ప్రత్యేక నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. ఆశవర్కర్లతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించుకుంటుందని, చాలీచాలని జీతాలు అదనపు పనిభారంతో ఆశవర్కర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆశవర్కర్లకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వర్కర్లు యశోద, లావణ్య, స్వరూప, మాధవి, యాదమ్మ, శ్రీవాణి, స్వప్న, అనసూయ, బాలమణి, మంజుల, మల్లేశ్వరి, నాగరాణి, కవిత తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన మాజీ జడ్పీటీసీ

మాజీ మంత్రి కేటీఆర్‌ను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుతో కలిసి జిన్నారం మాజీ జడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డి శుక్రవారం హైదరా బాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఉమ్మడి జిన్నారం మండలంలో చేపడుతున్న పార్టీ కార్యక్రమాలను బాల్‌రెడ్డి కేటీఆర్‌కు వివరించారు.

-జిన్నారం, మార్చి 21

కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని వృథా చేసుకోవద్దు

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి రమేశ్

సంగారెడ్డి, మార్చి 21 : కోర్టుల కేసులు వేసుకుని దీర్ఘకాలికంగా న్యాయస్థానాల చుట్టూ తిరిగి సమయం, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కక్షిదారులు సమయాన్ని వృథా చేసుకోవద్దని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ ఆయా కుల సంఘాల ప్రతినిధులకు అవగాహన కల్పించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ భవానీచంద్ర ఆదేశాలతో పట్టణంలోని న్యాయ సేవా సదన్ భవనంలో వివిధ సంఘాల ప్రతినిధులతో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయ పరమైన విషయంలో ఉచిత న్యాయ సహాయం కావాలంటే న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

పోచాపూర్ ఆయకట్టుకు నీళ్లొచ్చాయి..

నారాయణఖేడ్, మార్చి 21: నల్లవాగు ప్రాజెక్ట్ పరిధిలోని పోచాపూర్ ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అధికారులను కోరిన మేరకు అధికారులు స్పందించి శుక్రవారం నీటిని విడుదల చేశారు. ఆయకట్టు కింద నీటిసరఫరా నిలిపివేయడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తూ రైతులు భూపాల్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ చూపి అధికారులతో చర్చించి నీరు వదిలే విధంగా కృషి చేశారు. దీంతో ఆయకట్టు రైతులు మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

స్వయం ఉపాధితో ముందడుగు వేయాలి

గుమ్మడిదలలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న బీఆర్‌ఎస్ నేత గోవర్ధన్ రెడ్డి

గుమ్మడిదల, మార్చి 21 : ఉద్యోగాలపై పూర్తిగా ఆధారపడకుండా ప్రతి ఒక్కరూ స్వయం ఉపాధి అవకాశాలను అన్వేషించి ముందడుగు వేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని హాస్టల్ రోడ్డులో సారా పుణ్యమ్మ భాస్కర్ గౌడ్ ఏర్పాటు చేసిన న్యాచురల్ డ్రాప్స్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటి పరిస్థితుల్లో ఉద్యోగ అవకాశాల కోసం ఎదురు చూసే బదులు స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, సూర్యనారాయణ, బండాల భాస్కర్, చంద్రారెడ్డి, జయపాల్ రెడ్డి, సారా మహేశ్‌గౌడ్, శేఖర్ గౌడ్, లడ్డూ, సాయి యాదవ్, వెంకటేశ్ యాదవ్, కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల పరిశీలన

పటాన్‌చెరు, మార్చి 21 : పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ శుక్రవారం పటాన్‌చెరు పట్టణంలో యాదవ శ్మశానవాటికలో అంత్యక్రియలకు నిర్మిస్తున్న చితి మండపాన్ని పరిశీలించారు. మెట్టుకుమార్ యాదవ్ సొంత నిధులతో నిర్మిస్తున్నానని, కాంట్రాక్టర్‌కు త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

సీఐటీయూ నాయకుల అరెస్టు

సదాశివపేట, మార్చి 21 : అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ అన్నారు. శుక్రవారం అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నిర్వహించిన చలో హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా సీఐటీయూ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసంఘటిత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో డీవైఎఫ్‌ఐ నాయకుడు శ్రీకాంత్ ఉన్నారు.

ఇద్దరు పోలీసు అధికారుల సస్పెన్షన్

మునిపల్లి, మార్చి 21 : మండలంలోని తెలంగాణ హరితరెస్టారెంట్ హోటల్లో గతేడాది డిసెంబర్ 10న, 2024న ప్రేమ జంట ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటనలో పోస్టుమార్టం చేసే క్రమంలో మృతుడి కుటుంబ సభ్యులు మునిపల్లి ఏఎస్సై, రైటర్ పోలీస్ అధికారులకు రూ.వెయ్యి ఇచ్చేందుకు వస్తే వారు ఇచ్చిన పైసలను నెలపై పడేసి మాకేందుకు ఇవి.. ఇంకా కావాలని డిమాండ్ చేసి మృతుడి కుటుంబ సభ్యులను బెదిరించారు. అధనంగా రెండు వేలు వసూలు చేసిన మునిపల్లి ఏఎస్సై ఏసయ్య, మునిపల్లి పోలీస్ స్టేషన్ రైటర్ విజయ్‌కు మార్‌లను ఉన్నత అధికారులను సస్పెన్షన్ చేశారు. ఈ విషయం అలస్యంగా వెలుగులోకి వచ్చింది. మునిపల్లి పోలీస్ స్టేషన్లో ఇద్దరు పోలీస్ అధికారులు సస్పెండ్‌పై శుక్రవారం స్థానిక మునిపల్లి ఎస్సై రాజేశ్ నాయక్‌ను వివరణ కోరగా, మృతుడి కుటుంబ సభ్యుల దగ్గర మునిపల్లి ఏఎస్సై, రైటర్ డబ్బులు డిమాండ్ చేసినట్లు తమ దృష్టికి రావడవంతో వారిపై ఉన్నత అధికారులకు రిపోర్ట్ చేసినట్లు తెలిపారు. లంచం అడిగిన ఇద్దరు పోలీస్ అధికారులపై ఉన్నత అధికారులు వేటు వేశారు.

యువకుడు మృతి

జిన్నారం, మార్చి 21: జిన్నారం మండలం అలీనగర్ శివారులోని సాయిరాం ప్యాకింగ్ పరిశ్రమలో కాంట్రాక్టర్ వద్ద పని చేసే ఓ యువకుడు వెల్డింగ్ వర్క్ నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు పైకప్పు నుంచి పడి మృతి చెందాడు. సీఐ రవీందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా శివంపేట మండలం నవాబ్ పేటకు చెందిన ప్రశాంత్ (28) సాయిరాం ప్యాకింగ్ పరిశ్రమలో కాంట్రాక్టర్ సూచనతో పైకప్పులో వెల్డింగ్ వర్క్ చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడి మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యువకుడి కుటుంబానికి స్థానిక నాయకులు అండగా నిలిచి పరిశ్రమ యాజమాన్యంతో చర్చించారు. నష్టపరిహారం కింద రూ.9 లక్షలు, అంత్యక్రియల నిమిత్తం తక్షణ సాయంగా రూ. 30 వేలు యువకుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. యువజన నాయకుడు సాయి భరత్, సీఐ రవీందర్ రెడ్డి ఉన్నారు.